సాక్షి రంగారెడ్డి
మంగళవారం । 21 । మే । 2024



అక్రమ నిర్మాణాల కూల్చివేత

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం ఎక్కడికక్కడ కూల్చివేశారు. 8లో▸



కష్టపడే వారికే అవకాశం

పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



మలేషియాలో మనోళ్ల సత్తా

మలేషియాలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో నగరానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. పలు పతకాలు సాధించారు. 8లో▸

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సీట్ల కేటాయింపు

ఇబ్రహీంపట్నం రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకంలో విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరిదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు మొత్తం 89 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 3వ తరగతికి 45 సీట్లు, 5వ తరగతికి 22 సీట్లు, 8వ తరగతికి 22 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 6 చివరి తేదీ అని, దరఖాస్తు ఫారాలు ఈనెల 21 నుంచి కొంగరకలాన్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ఉచితంగా పొందొచ్చని ఆమె తెలిపారు. కులం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేయాల్సి ఉంటుందన్నారు. సంవత్సరానికి ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు మించరాదన్నారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు



బ్రోచర్ ఆవిష్కరణ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ హుడాకాంప్లెక్స్‌లోని లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు స్వధర్మయోగి ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన బ్రోచర్లను సోమవారం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన డ్రిల్ మాన్‌క్రాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత జ్ఞాపకశక్తి పెంచి వారికి నైతిక విలువలతో కూడినటువంటి యోగా విద్యను అందజేయాలనే ఉద్దేశంతో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం రకరకాల మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్న విద్యార్థులకు వాటిని అధిగమించడానికి కావాల్సిన యోగా శిక్షణ సాధన పద్ధతులు నేర్పిస్తామన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని, వివరాలకు 96032 56572 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘బెల్ట్’ తీశారు

ఆరుగురి బైండోవర్



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శేఖర్

షాద్‌నగర్: విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతుండటంతో చాలామంది బానిసై ప్రాణాలు కోల్పోతున్నారని, బెల్టు దుకాణాలు మూసివేయాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు చేపట్టిన నిరాహార దీక్షకు షాద్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి, సోమవారం ఎక్సైజ్ సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ఆరుగురిని గుర్తించారు. వారిని సోమవారం ఉదయం ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శేఖర్ మాట్లాడుతూ.. బెల్టు దుకాణాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అక్రమంగా దుకాణాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటలాడుతూ.. అనంత లోకాలకు

గేటు దిమ్మెకూలి చిన్నారి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: తోటి స్నేహితులతో కలిసి ఆ చిన్నారి సరదాగా ఇంటి ముందు ఆడుకుంటోంది. ప్రమాదవశాత్తు గేటు దిమ్మెకూలి తలపై పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాదకర ఘటన ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పినమోని మల్లేశ్, రమాదేవి దంపతుల చిన్న కుమార్తె సాక్షి (5) సోమవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటోంది. ఆడుతూ ఎదురింటి ప్రహరీ వద్దకు వెళ్లారు. సాక్షి శిథిలావస్థకు చేరిన గేటు దిమ్మెను పట్టుకోగానే అది అమాంతం తలపై పడింది. దీంతో చిన్నారి మెదడు పూర్తిగా చిట్లిపోయి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడిచింది. స్నేహితులు వెంటనే విషయాన్ని సాక్షి తల్లిదండ్రులకు చెప్పారు. అప్పటివరకు సరదాగా ఆడుకుంటున్న తమ చిన్నారి అంతలోనే విగతజీవిగా మారడం చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కంప్యూటర్ విద్య.. మిథ్య



ఇన్ముల్‌నర్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ల పరిస్థితి

సర్కార్ బడులకు నిర్లక్ష్యపు జబ్బు

- చాలా పాఠశాలల్లో మూలన పడ్డ కంప్యూటర్లు
- కలగా మారిన సాంకేతిక విద్య
- విద్యార్థులకు అందని పరిజ్ఞానం
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థి సంఘాలు

కొత్తూరు: ప్రస్తుతం అన్ని రంగాల్లో సాంకేతికత విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాన్ని పొంపొందించడానికి ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే శిక్షణ ఇస్తున్నారు. పదోతరగతి పూర్తి చేసే సరికే వారు కంప్యూటర్ విద్యలో నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. ఈ తరహా విద్యను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2008లో కంప్యూటర్ విద్యకు శ్రీకారం చుట్టింది. మొదట్లో పథకం బాగానే అమలైనప్పటికీ రానురాను నిర్వహణలో నిర్లక్ష్యం పెరిగింది. అటు ప్రభుత్వం, ఇటు విద్యాశాఖ పట్టించుకోకపోవడంతో మూడేళ్లలోనే పథకం కాస్తా అటకెక్కింది. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగానే మిగిలింది.

నిర్వహణ లేక నీరుగారి..

కంప్యూటర్లను పంపిణీ చేసిన ప్రభుత్వం పాఠాలు బోధించే ఉపాధ్యాయులను నియమించడం మాత్రం మరిచిపోయింది. కంప్యూటర్లను పంపిణీ చేసిన ఏడాది తర్వాత ఉపాధ్యాయులు.. విద్యార్థుల నుంచి ఒత్తిడి రావడంతో మొదటగా కొన్ని నెలలు కంట్రాక్ట్ పద్ధతిన ట్రైనర్స్‌ను నియమించి పాఠాలు బోధించేలా చర్యలు తీసుకుంది. ఆ తర్వాత వారికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం.. కంప్యూటర్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా పాఠశాలల్లో అవి మూలకు చేరాయి. పలు పాఠశాలల్లో కంప్యూటర్ తరగతుల నిర్వహణకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటి వరకు వాటిని సక్రమంగా ఉపయోగించింది లేదు.

ఈ ఏడాదైనా కొనసాగేనా?

వచ్చే నెల 13వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో ఇంగ్లిష్ మీడియం పాఠశాలల నిర్వహణ, కంప్యూటర్ విద్యతో పాటు పలు మార్పులు తీసుకురావాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. లేని పక్షంలో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని.. విద్యార్థులు చేరడం కష్టమని చెబుతున్నాయి. ఈ దిశగా అధికారులు, పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.



సిద్ధాపూర్ పాఠశాలలో మూలన పడ్డ కంప్యూటర్లు, సామగ్రి

కంప్యూటర్ విద్య అవసరం



ప్రస్తుతం బోధన పద్ధతుల్లో వస్తున్న మార్పుల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి కంప్యూటర్ విద్య అవసరం. ఈ ఏడాది నుంచైనా ప్రభుత్వ పాఠశాలల్లో కచ్చితంగా కంప్యూటర్ విద్యను ప్రారంభించాలి.

– నరేష్‌చారి, విద్యార్థి సంఘం నాయకుడు

నిలిచిపోయింది



ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యాబోధన కొన్నేళ్ల క్రితం నుంచే నిలిచిపోయింది. ప్రస్తుతం ఎక్కడా బోధించడం లేదు. గతంలో పాఠశాలలకు పంపిణీ చేసిన కంప్యూటర్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి.

– కృష్ణారెడ్డి, ఎంఈఓ, కొత్తూరు

ధాన్యం వెంటనే దించుకోవాలి

ఇబ్రహీంపట్నం: కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరితగతిన స్వీకరించాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రఘునందన్ అన్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని పలు రైస్ మిల్లులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొరుగు జిల్లాల నుంచి కూడా వడ్లు వస్తున్నాయని తెలిపారు. కనీస మద్దతు ధరతో వచ్చిన ధాన్యం లోడ్ లారీలను రెండుమూడు రోజుల వరకు నిలపకుండా సాధ్యమైనంత త్వరగా దించుకోవాలని సూచించారు. రోజువారీ దిగుమతి వివరాలు ఎప్పటికప్పుడు మిల్లుల్లో పొందుపర్చాలని స్పష్టం చేశారు.



రైస్‌మిల్లు తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

దత్తత దారిలో..



అధిక బరువు.. ఆలస్యపు పెళ్లిళ్లు.. రోజంతా ల్యాప్‌ట్యాప్‌లతో సహవాసం.. కాలుష్యం.. మారిన జీవనశైలి.. మానసిక ఒత్తిడి.. వెరసి నవ దంపతుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఎంత ప్రయత్నించినా.. ఎన్ని మందులు వాడినా సంతానం కలుగక.. ఒంటరిగా ఉండలేక చాలా మంది యువ దంపతులు అనాథ పిల్లలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. దత్తతకు పిల్లలు కావాలని కోరుతూ 2,050 మంది దంపతులు శిశువిహార్‌కు దరఖాస్తు చేసుకోవడం విశేషం.

- పెరిగిపోతున్న సంతాన లేమి జంటలు
- అనాథ పిల్లల దత్తతపై ఆసక్తి
- శిశువిహార్‌లో 186 మంది పిల్లలు.. 2,050పైగా దరఖాస్తులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఒకప్పుడు పాతికేళ్లకే పెళ్లి చేసుకుని, ఏడాది తిరక్క ముందే పండంటి బిడ్డకు జన్మనిచ్చేవారు. కానీ ప్రస్తుతం చాలా మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల వేటలో పడి 30 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లికి సిద్ధపడుతున్నారు. గంటల తరబడి ల్యాప్‌టాప్‌లతో గడపడం..జంక్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం, వీకెండ్‌లో పార్టీల పేరుతో మద్యం అతిగా తాగడం వంటి అలవాట్లు స్త్రీ, పురుషుల హార్మోన్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. పెళ్లైనాలుగైదేళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవడంతో చివరకు సంతాన సాఫల్య కేంద్రాకు పరుగులు తీస్తున్నారు. ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్(ఐవీఎఫ్), ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్(ఐసీఎస్ఐ)చికిత్సలు చేయించుకున్నా..ఫలితం లేక పోవడంతో చివరకు కొందరు ప్రత్యామ్నాయాలపై దృష్టిసారిస్తున్నారు. ఒంటరిగా జీవించలేక, పిల్లలపై మమకారం చంపుకోలేక అనాథ పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

186 మంది పిల్లలు.. 2,050 దరఖాస్తులు

గతంతో పోలిస్తే దంపతుల వైఖరిలో చాలా మార్పులు వచ్చాయి. ఆడపిల్లలు ఇంటికి భారమని భావించే రోజులు పోయాయి. శిశువిహార్‌లో పిల్లలను దత్తత తీసుకుంటున్న జంటల జాబితాను పరిశీలిస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుతం శిశువిహార్‌లో 2,050 మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకుని ఉండగా, 186 మంది పిల్లలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దత్తతకు దరఖాస్తు చేసుకున్న వాళ్లలో ఎక్కువ మంది మగపిల్లలు కావాలని కోరగా, అందులో అత్యధికంగా ఏడాదిలోపు పిల్లలను కోరుకుంటున్న వారే అధికం. రంగు, ఎత్తు, బరువు వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆడ శిశువుకు రెండు నుంచి మూడేళ్లు సమయం పడుతుండగా, మగ శిశువుకు ఐదు నుంచి ఆరేళ్లు పడుతోంది. పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నా.. అది కూడా గ్యారంటీ లేదు. ఇదిలా ఉంటే గత పదిహేనేళ్లలో శిశువిహార్ ద్వారా మొత్తం మూడు వేల మందికిపైనే దత్తత ఇస్తే, కేవలం నాలుగేళ్లలో 798 మంది పిల్లలను మాత్రమే దత్తత ఇవ్వగా, వీరిలో 527 మంది ఆడపిల్లలు ఉన్నారు.

పురుషుల్లోనూ..



గతంలో 5 నుంచి 10 శాతం మందిలోనే ఇన్‌ఫెర్టిలిటీ సమస్య ఉండేది. ఇప్పుడది 15 నుంచి 20 శాతానికి పెరిగింది. మహిళల కంటే పురుషుల్లోనే ఈ సమస్య ఎక్కువ కనిపిస్తోంది. చిన్న వయసులోనే మెనోపాజ్ వస్తుండటంతో చాలా మంది రెండోసారి గర్భధారణకు నోచుకోవడం లేదు. దంపతుల్లో ఉన్న బలహీనతను ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. సాధారణ చికిత్సలతో పిల్లలు జన్మించే అవకాశం ఉన్నా.. ఐవీఎఫ్, ఐయూవీ వంటి చికిత్సల పేరుతో బాధితులను పెద్ద ఎత్తున లూటీ చేస్తున్నారు.

– డాక్టర్ బాలాంబ, సీనియర్ గైనకాలజిస్ట్

ప్రాధాన్యతను బట్టి



గతంతో పోలిస్తే పిల్లలను దత్తతకు తీసుకునే వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. దత్తతకు ఇక్కడ పిల్లలు లేక చాలా మంది నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా వందకుపైగా దరఖాస్తులు అందుతున్నాయి. దంపతుల అభీష్టం మేరకు పిల్లలను దత్తత ఇస్తున్నాం. విదేశాల్లో స్థిరపడిన వారు కూడా ఇక్కడి పిల్లలను దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న దంపతుల ప్రాధాన్యతను బట్టి పిల్లల దత్తతకు అవకాశం కల్పిస్తున్నాం.

– మోతీ నాయక్, అదనపు డైరెక్టర్, శిశువిహార్

ఆ ఆకతాయిలు దొరికారు

- బస్సు ధ్వంసం కేసును ఛేదించిన పోలీసులు
- ఎనిమిది మంది నిందితులకు రిమాండ్



పోలీసులకు పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న కత్తి

మహేశ్వరం: గుర్రం పందేలు నిర్వహిస్తూ నిర్లక్ష్యంగా బైక్‌లు నడిపి ఆర్టీసీ బస్సుపై దాడిచేసిన ఎనిమిది నిందితులను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు గుర్రాలు, మూడు బైక్‌లు, కత్తి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ పాతబస్తీ ఫలక్‌నుమా మదీనా కాలనీకి చెందిన కలీముద్దీన్ తాసిఫ్, బహదూర్‌పురా కిషన్ బాగ్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ కందుకూరు మండలం గ్రీన్ ఫార్మాసిటీ రోడ్డులో గుర్రం రేసింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రాం వేదికగా పోస్ట్ చేశారు. పోస్టును చూసిన సుమారు 50 మంది బెట్టింగ్‌లో పాల్గొనేందుకు బైక్‌లపై వచ్చారు. ఈ నెల 16న ఉదయం 5.30 గంటల సమయంలో గుర్రాలతో పాతబస్తీ నుంచి గ్రీన్‌ఫార్మాసిటీ రోడ్డుకు చేరకున్నారు. ఆరు కిలోమీటర్లు ఎంచుకుని పందెం నిర్వహించారు. తిరిగి శ్రీశైలం జాతీయ రహదారిపై బైక్‌లపై అదేపనిగా హారన్‌లు కొడుతూ ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించారు. కల్వకుర్తి ఆర్టీసీ డిపో బస్సు హైదరాబాద్ వైపు వెళ్తుండగా సైడ్ ఇవ్వలేదంటూ రాచలూరుగేట్ సమీపంలో ఆపి సయ్యద్ అహ్మద్ హస్మీ, మహ్మద్ వజహాత్ హుస్సేన్ కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో కల్వకుర్తి ప్రయాణికుడు చీకొండ నాగరాజు చేతికి గాయాలయ్యాయి. ఈ మేరకు డ్రైవర్, కండక్టర్, ప్రయాణికుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సయ్యద్ అహ్మద్, మహ్మద్ వజహాత్, ముసా కలీముద్దీన్ తాసిఫ్, మహ్మద్ ఆసిఫ్, సయ్యద్ జునైద్ అలీ, కాషిఫ్ రజీద్దీన్, అబ్బసాయిలు, మహ్మద్ గౌస్, మహ్మద్ మజార్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి గుర్రాలు, బైక్‌లు, కత్తి, ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ సునీతారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ మక్బూల్ జానీ, మహేశ్వరం ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, క్రైమ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

బత్తిని కుటుంబ సభ్యులు

పంజగుట్ట: ఆస్తమా, ఉబ్బసానికి సంబంధించిన వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న చేప ప్రసాదం ఈ సంవత్సరం జూన్ 8న శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ చేయనున్నట్లు బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బత్తిని అమర్నాథ్‌గౌడ్, శివశంకర్ గౌడ్, గౌరీశంకర్ గౌడ్ మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 11 నుంచి 9వ తేదీ ఉదయం 11 వరకు 24 గంటల పాటు నిరంతరాయంగా చేప ప్రసాదం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తరువాత మూడు రోజులపాటు దూద్‌బౌలిలోని తమ నివాసం వద్ద పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే 3 లక్షల చేప పిల్లలు సిద్ధంగా ఉంచినట్లు, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, వాటర్‌వర్క్స్, మున్సిపాలిటీ, పోలీస్ ఎప్పటిలాగే సహాయ సహకారాలు అందించాలని లేఖలు రాసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో జూన్ 7న ప్రసాదం పంపిణీ అని వార్తలు వస్తున్నాయని, అవి తప్పుడు వార్తలని.. 8నే ప్రసాదం పంపిణీ ఉంటుందని స్పష్టం చేశారు.

అంతా ‘గ్యాసే’నా?



- రూ.500కు సిలిండర్ కొందరికే..
- విద్యుత్ జీరో బిల్లుకు అర్హత సాధించినా గ్యాస్ సబ్సిడీ వర్తించని పరిస్థితి
- గ్యాస్ ఏజెన్సీలకు సైతం స్పష్టత కరువు
- బీపీఎల్ వినియోగదారులపై భారం

వంటగ్యాస్ కనెక్షన్లు ఇలా

హైదరాబాద్ జిల్లా	13.22 లక్షలు
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా	15.96 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కొందరికే పరిమితమైంది. తెల్ల రేషన్ కార్డు కలిగి విద్యుత్ జీరో బిల్లుకు అర్హత సాధించినా.. వంటగ్యాస్ సబ్సిడీ మాత్రం వర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో నిరుపేదలకు ఎప్పటి మాదిరిగా వంటగ్యాస్ ధర భారంగా తయారైంది. మూడు నెలల క్రితమే మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకం అమలు ప్రారంభమైంది. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా బీపీఎల్ కుటుంబాలను అర్హులుగా గుర్తించి జీరో బిల్లు, వంటగ్యాస్ సబ్సిడీకి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు పథకాలకు కూడా తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. వాస్తవంగా మహా నగరంలో సుమారు 17.21 లక్షల కుటుంబాలు తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉండగా అందులో సుమారు 11 లక్షల కుటుంబాలకు మాత్రమే విద్యుత్ జీరో బిల్లు వర్తించింది. రూ.500కు వంట గ్యాస్ మాత్రం అందులో కేవలం రెండు లక్షల కుటుంబాలకు మాత్రమే వర్తిస్తోంది. గ్యారంటీ పథకాల కింద బీపీఎల్‌గా అర్హత సాధించినా వంట గ్యాస్‌పై సబ్సిడీ వర్తించకపోవడంతో పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.855కు సిలిండర్..

మహా నగరంలో బహిరంగ మార్కెట్ ప్రకారం ప్రస్తుతం 14.5 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855 పలుకుతోంది. గృహ వినియోగదారులు సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థల ద్వారా సబ్సిడీని నగదు బదిలీ కింద వినియోగదారుల ఖతాలో జమచేస్తూ వస్తోంది. తాజాగా ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా అర్హత సాధించిన వంట గ్యాస్ లబ్ధిదారులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్ ధరలో రూ.500 మినహాయించి మిగిలిన సొమ్మును నగదు బదిలీ ద్వారా వినియోగదారులు ఖాతాలో చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ అందరికి వర్తిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ మాత్రం కొందరికే పరిమితమైంది.

కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ. 40.71 మాత్రమే..

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీని పరిమితం చేసింది. సిలిండర్ ధర ఎంత పలికినా.. సబ్సిడీ సొమ్ము మాత్రం రూ.40.71లు మాత్రమే వినియోగదారుడి ఖాతాలో జమ చేస్తోంది. పదేళ్ల క్రితం వరకు సబ్సిడీపై రూ.414కు మాత్రమే వంట గ్యాస్ ధర సరఫరా జరిగేది. మిగతా ధరను కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే భరించేది. ఆ తర్వాత వంట గ్యాస్‌కు నగదు బదిలీ పథకం వర్తింపుజేయడంతో బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సిలిండర్ సరఫరా చేసి ఆ తర్వాత సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తూ వచ్చారు. 2015లో సిలిండర్‌ను మార్కెట్ ధర ప్రకారం రూ. 697కు కొనుగోలు చేస్తే సబ్సిడీగా రూ.239.65 నగదు బదిలీ ద్వారా వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేది. బహిరంగ మార్కెట్‌లో సిలిండర్ ధర పెరిగిన దానిని బట్టి సబ్సిడీ నగదు కూడా పెరిగేది. ఆ తర్వాత క్రమంగా సబ్సిడీ ఎత్తివేతలో భాగంగా పరిమితి విధించారు. ప్రస్తుతం ధర ఎంత ఉన్నా.. సబ్సిడీ మాత్రం ఒక స్లాబ్‌కు పరిమితమైంది.



కష్టపడేవారికే పోటీ చేసే అవకాశం



నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశాన్ని కల్పిస్తామని.. మెజార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ పటిష్టతకు పనిచేసేవారి సమాచారం తన వద్ద ఉందని కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేసేవారిని పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకే ఎంపిక చేస్తామన్నారు. అనంతరం యూత్‌కాంగ్రెస్‌లో మండల పదవులు వరించిన శ్రీకాంత్, రమేశ్, జహంగీర్, నర్సింహ, రాజు, అర్జున్, అంజయ్య తదితరులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరారం వెంకట్‌రెడ్డి, మోటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి బైండోవర్

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామా ల్లో అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తున్న ఏడుగురిని సోమవారం ఇబ్రహీంట్నం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ అయ్యప్ప ఎదుట బైండోవర్ చేశారు. యాచారం, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో నాటుసారా, మద్యం విక్రయాలు చేపట్టొద్దని హెచ్చరించినా వారిలో మార్పు రాలేదు. దీంతో ఏడుగురిని బైండోవర్ చేశారు. గ్రామాల్లో మద్యం, నాటు సారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతో రూ. లక్షల జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

తిరుమలలో చిన్నారుల నృత్య ప్రదర్శన



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి చెందిన పలువురు చిన్నారులు తిరుమలలో జరుగుతున్న ఉత్సవాల్లో నాట్యం చేసే అవకాశం లభించింది. సోమవారం ఉదయం దేవాలయం మాడవీధుల్లో సామూహికంగా జరిగిన భరతనాట్యం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తమకు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ముందు నాట్యం చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కె. మమత, కె. ప్రవస్తి, ఎ.హమ్షిక, ఎ.వీణ, ఎం. హరినీరెడ్డి, ఎం. సిద్ధిక్షరెడ్డి నాట్య ప్రదర్శన చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



షెడ్డును కూల్చివేయిస్తున్న అధికారులు



కొందుర్గు: లూర్దునగర్‌లో అధికారులు కూల్చివేయించిన ప్రహరీ

హయత్‌నగర్: ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ రవీందర్‌దత్త తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పసుమాముల సర్వే నెంబర్ 422లో సుమారు 2,000 గజాల స్థలంలో ఓ షెడ్డును నిర్మించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో షెడ్డును తొలగించారు. కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రహరీ కూల్చివేత

కొందుర్గు: ఆలయ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై దేవాదాయ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. సోమవారం ఎండోమెంట్ ఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన 89 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. కోర్టులో కేసులుండగానే లూర్దునగర్ గ్రామానికి చెందిన జయారెడ్డి ఇంటి చుట్టూ ప్రహరీ నిర్మించింది. దీంతో ఉదయం దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధుబాబు ఆధ్వర్యంలో ప్రహరీ కూల్చివేశారు.

మలేషియాలో మనోళ్ల సత్తా

కరాటే పోటీల్లో పతకాలు సాధించిన చిన్నారులు



సాధించిన పతకాలు చూపుతున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో నగరానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. ఇటీవల గోజురియో హైపోసిటీ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో సరూర్‌నగర్ మండలం విజయపురికాలనీ, డాక్టర్స్‌కాలనీలకు చెందిన ఎస్.జైకార్తికేయన్, ఎస్.తమన్, ఎ.ఎస్.ఎన్.గౌతంలు కట్టాస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు రజత పతకాన్ని సాధించి దేశానికి గుర్తింపు తీసుకొచ్చారు. సీనియర్ కటాస్ విభాగంలో వైఆర్ శివకుమార్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైటింగ్ విభాగంలో జైకార్తికేయన్ రజతం, తమన్, గౌతంలు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. చిన్నారులను జపాన్ షోటోకాన్ అసోసియేషన్ సీకో కరాటే డూ కోచ్ వై.ఆర్.శివకుమార్ అభినందించారు.

అధిక ఫీజులను కట్టడి చేయాలి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఆర్.కృష్ణయ్య వినతి

ముషీరాబాద్: రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్ల పేరుతో విద్యార్థుల నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు సోమవారరం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా ప్రమాణాలను పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలను నడుపుతూ రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీరి ఒత్తిడిని తట్టుకోలేక ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, కార్పొరేట్ కళాశాలలపై వారు నియంత్రణ కోల్పోయారన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం చేసి కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు నీల వెంకటేష్, గుజ్జ సత్యం, గోరిగే మల్లేష్‌యాదవ్, రుషికుమార్, నిఖిల్‌పటేల్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం



బికాశ్‌దాస్(ఫైల్)

కొత్తూరు: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. పట్టణంలో నివసిస్తున్న ఊర్మిలాదేవి కుమారుడు బికాశ్‌సింగ్(34) ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఊర్మిలాదేవి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీజీ హాస్టల్‌లో మాదకద్రవ్యాల పట్టివేత

5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

గచ్చిబౌలి: మెన్స్ పీజీ హాస్టల్ అడ్డాగా ఓ వ్యక్తి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడులు నిర్వహించి 5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ భాను ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సుల్తాన్ కుమార్ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కొండాపూర్, రాఘవేంద్ర కాలనీలోని పీఆర్ గ్రాండ్ మెన్స్ పీజీ హాస్టల్ ఉంటున్నాడు. స్నేహితుడి ద్వారా అతడికి నగరానికి చెందిన లక్కీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. సోమవారం స్నాప్ షాట్‌లో సుల్తాన్ కుమార్‌తో మాట్లాడిన లక్కీ ఓ వ్యక్తి ఎండీఎంఏ తెచ్చి ఇస్తాడని, వాటిని తాను చెప్పిన వ్యక్తికి అప్పగించాలని సూచించాడు. డ్రగ్ డెలివరీ అయినట్లు సమాచారం అందడంతో సోమవారం మధ్యాహ్నం ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు పీజీ హాస్టల్‌లో సోదాలు నిర్వహించి సుల్తాన్ కుమార్ నుంచి రూ.30 వేల విలువ చేసే 5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్టర్లు భూమి ఆక్రమించారని ఫిర్యాదు



మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వీరస్వామిగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: భూమిని కబ్జా చేసిన ఓ రియల్టర్ బెదిరింపులకు పాల్పడ్డుతున్నాడని ఓ రైతు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశాడు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన రైతు ఉడుతల వీరస్వామిగౌడ్‌కు సర్వే నంబర్ 383, 384లో ఐదుగుంటల భూమి ఉంది. దీన్ని ఐరా రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని ఆరోపించాడు. ఇదే విషయమై సదరు సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తే వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణ కిశోర్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించాడు. ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ సైతం ఇచ్చిందని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్, మున్సిపల్ చైర్మన్‌ను కోరాడు.

యజమానులకు సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అందజేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్ : వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో యజమానులకు పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సీఈఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీ జరిగిన మొబైల్ ఫోన్లు తిరిగి వాడితే వాటిని గుర్తించడం తేలికగా మారిందన్నారు. ఆర్‌జీఐఏ, శంషాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మొత్తం 30 స్మార్ట్‌ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



బంజారాహిల్స్: అపోలో ఆస్పత్రి వైద్యుడి ఇంట్లో నగదు, నగల చోరీకి పాల్పడిన ఘరానా దొంగను జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... నారాయణపేట మండలం, ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి శివకుమార్ అలియాస్ శంకర్ పర్వత్‌నగర్‌లో ఉంటూ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-52లోని ఓ టీవీ చానల్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను తాను పనిచేస్తున్న టీవీ చానల్ ఎదురుగా ఉండే అపోలో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ అశోక్‌కుమార్ ఇంటిని టార్గెట్ చేసుకున్నారు. రెక్కీ నిర్వహించి ఆయన ఇంట్లో లేని సమయంలో లోపలికి ప్రవేశించి రూ. 25.70 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వెండి బిస్కెట్లు తస్కరించి కారులో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించారు. స్విఫ్ట్ డిజైర్ కారు రోడ్డు పక్కన ఆపి ఉండటం, దొంగతనం చేసిన యువకుడు అదే కారులో కర్నూలు హైవేలో వెళ్తున్నట్లు గుర్తించి పోలీసులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి వాహన తనిఖీలు చేపట్టారు. శివకుమార్ నడుపుతున్న కారులో నగదును కూడా గుర్తించి జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి రూ. 23.70 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వెండి బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన కారు, కటింగ్ ప్లేయర్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలోనూ అతను మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు క్రికెట్ వీక్షణ అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ''అభిమాన క్రికెట్ హీరోలు మైదానంలో పోరాడుతుండగా చూడడం ఆనందాన్ని కలిగించడమే కాక ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది''అని ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ వేదిక గేమ్స్ 24/7 సహ-వ్యవస్థాపక సీఈఓ భవిన్ పాండ్యా అన్నారు. గేమ్స్ 24/7 ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద యువ క్రీడాకారులకు ఉప్పల్ స్టేడియంలో ఆదివారం హైదరాబాద్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ టి 20 మ్యాచ్‌ను చూసే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఔత్సాహిక క్రీడాకారుల ఆకాంక్షలను బలోపేతం చేసేందుకు వీల్స్ ఆఫ్ చేంజ్ పేరిట కార్యక్రమం చేపట్టామని, దీని కోసం నగరానికి చెందిన ఓ స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె. సాయిబాబా మాట్లాడారు.

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలేవీ?

పార్కుల దగ్గర కనిపించని ఇంకుడు గుంతలు

- రోడ్లపైనే పారుతున్న వరదనీరు



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం



పీఅండ్‌టీ కాలనీలో నిర్మించిన ఇంకుడు గుంతలో వ్యర్థాలు

బండ్లగూడ: భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది. గతంలో భూగర్భ జలాలు అతి తక్కువ లోతులోనే లభ్యమయ్యేవి. ప్రస్తుతం అత్యధికంగా భూగర్భ జలాలను వాడుకోవడం వలన ఇప్పటికే గ్రౌండ్ వాటర్ అడుగంటిపోతున్నాయి. ఈ భూగర్భ జలాలు ప్రమాద స్థాయికి చేరకముందే భూగర్భ జలాల స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్లక్ష్యం..

కార్పొరేషన్ పరిధి భూగర్భ జలాలు అడుగంటే పలు కాలనీల్లో ఇంకుడు గుంతలు, వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రతి ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ పట్టించుకునేవారే కరవయ్యారు. కార్పొరేషన్ పరిధిలో అప్పట్లో 200 అడుగు లోతుల్లోనే పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం 1000 అడుగుల లోతున తవ్వితే కానీ బోర్లలో నీటి చుక్క జాడ కనిపించట్లేదు. ప్రతి ఇంట్లో నిత్యావసరాలకు ఉపయోగించే నీటికంటే వృథాగా పోయే నీరే ఎక్కువ. వృథాగా పోయే నీటిని ఒక చోటికి చేర్చితే భవిష్యత్‌తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని పలువురు మేధావులు చెబుతున్నారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రతి ఒక్కరూ సామాజికపరంగా ప్రజల్లో అవగాహన చేపట్టి భారీఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టగలిగే ప్రయత్నం చేస్తే సరైనా ప్రతిఫలం పొందగల్గుతామని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధన ఉన్నా..

ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధన ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చూసీచూడనట్లుగా ఉండటంతోనే నిర్మాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వర్షపునీరు వచ్చే దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాల్లో ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెరుగుతున్న నిర్మాణాలు..

నగరానికి అత్యంత చేరువలో ఉండటంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలు చేపడుతున్నారు. కొంతమంది బిల్డర్లు మాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధనను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ఇంకుడుగుంతల నిర్మాణాలు నిర్మించాలనే నిబంధనను సరిగ్గా అమలు చేయక పోతుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తుంది.

నాలుగింటితో సరి

కార్పొరేషన్ పరిధిలో 200లకు పైగా కాలనీలు, 1.50 లక్షల జనాభా ఉన్నట్టు అంచనా. ఆయా కాలనీల్లో నిర్మాణాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. అధికారులు ఎందుకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నది ప్రశ్నగా మారింది. ఇప్పటి వరకు అధికారులు ప్రభుత్వ స్థలంలో నాలుగే ఇంకుడు గుంతలు నిర్మించడం ఆలోచించాల్సిన విషయం.

నిబంధనలు పాటించేలా చూస్తాం



నూతన నిర్మాణాలు చేపట్టే చోట ఇంకుడు గుంత తప్పకుండా నిర్మించాలి. లేదంటే తగిన చర్యలు చేపడతాం. నిర్మాణదారులకు ఇంకుడు గుంతలపై టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ విజయలక్ష్మి అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం 6 ఇంకుడు గుంతలకు ప్రపోజల్ పెట్టాం. మరిన్ని ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తాం. – శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్